క్లుప్తంగా

మీటింగ్‌హాల్‌కు నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

వైరా: వైరాలో పెన్షనర్ల సౌకర్యార్థం పెన్షనర్ల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం పెన్షనర్లు ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కళ్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య, టీవీ.కృష్ణయ్య, తాళ్లూరు వేణు, చల్లా కృష్ణారావు, జి. సుబ్బయ్య తదితరులున్నారు.

తిరువీధి సేవ



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ: మండలపరిధిలోని ముత్తారంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం హోమం, వసంవారికిష్టాపురంలో స్వామివారి తిరువీధి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని గరుడవాహనంపై గరుడోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ చైర్మన్ తుళ్లూరి జీవన్, ధర్మకర్త వనం వెంకట నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

గురుకులానికి ఎంపిక



శివ, దీపక్

కారేపల్లి: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో కారేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ముండ్ల శివ రాజ్‌కుమార్, ఆదెర్ల రాగదీపక్ ప్రతిభ కనబరిచి సీట్లు సాధించినట్లు హెచ్‌ఎం రమేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు నాగ దీప్తి, శ్యామల అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: అకాలవర్షాలతో పంటలను రైతులు నష్టపోతున్నందున ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అయ్యగారిపేట ధాన్యం కొనుగోళ్ల కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో రావుల రాజబాబు, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

గొలుసు చోరీపై కేసు నమోదు

చింతకాని: బంగారు గొలుసు చోరీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై నాగుల్‌మీరా తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్‌బీ ఇంట్లో 20 రోజుల క్రితం రూ.75 విలువచేసే గొలుసు చోరీకి గురైంది. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సీపీఐ కార్యదర్శిగా రవికుమార్



చింతకాని: మండలపరిధిలోని రాఘవాపురం సీపీఐ గ్రామశాఖ కార్యదర్శిగా కొల్లి రవికుమార్ ఎన్నికయ్యారు. గ్రామంలో మంగళవారం ఏర్పాటుచేసిన పార్టీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా కంప అమరయ్యతో పాటు మరో ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కొనుగేలి చేసినట్టే..



కొణిజర్లలో ఆరబోసిన మొక్కజొన్నలు

పేరుకే కొనుగోలు కేంద్రాలు..
అయినా మొదలుకాని కొనుగోళ్లు

- సగానికి పైగా మక్కలు చేజిక్కించుకున్న వ్యాపారులు
- మద్దతు ధర దక్కక నష్టపోతున్న రైతులు

కొణిజర్ల: గ్రామగ్రామాన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం, మక్కలు కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు తొలగిస్తామని నాయకులు చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇంతవరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు నిండా మునిగిపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ప్రకృతి వైపరిత్యానికి గురికాకుండా కాపాడుకుంటే తీరా అమ్ముకునేటప్పటికీ గిట్టుబాటు ధర లేక దళారులు చెప్పిన ధరకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో రెండో స్థానం

ప్రతీ ఏటా మక్కల సాగులో జిల్లాలోనే దాదాపు రెండో స్థానంలో ఉండే కొణిజర్ల మండలంలో ఈ యాసంగిలో రైతులు సుమారు 20 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. దీనిలో 40 శాతం ఆడ, మగ రకం సీడ్ కాగా, మిగిలినదంతా నాటు మొక్కజొన్నే. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు బాగుండటంతో రకానికి 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావడంతో రైతులు మక్కలను కల్లాల్లో ఆరబోశారు. పది రోజుల క్రితం మక్కల రేటు రూ.2,200 క్వింటాల్‌కు ఉండగా ప్రస్తుతం రూ.2,100, రూ.2,050 మాత్రమే పెట్టి దళారులు కొనుగోలు చేస్తున్నారు. చెల్లింపులు కూడా 15 రోజుల తర్వాతే చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు తుపాన్ కారణంగా మూడు, నాలుగు రోజులు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ చెబుతుండటంతో రైతులు మక్కలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారుల స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రకటనే మిగిలింది..

ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి మండలంలోని కొణిజర్ల, పల్లిపాడు, పెద్ద మునగాల, తుమ్మలపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కానీ నేటికీ ఆ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కొంతమంది ఇప్పటికే పెట్టుబడులు, కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి ఉండటంతో రైతులు ప్రయివేట్ వ్యాపారులు అడిగిన కాడికి తెగ నమ్ముతున్నారు. రైతులు దళారులకు అమ్ముకోగా మధ్య దళారులు రైతుల పేర్లతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మక్కలు తరలించి, అక్కడి నుంచి నేరుగా మిల్లులకు తరలించే ప్రక్రియ ఏటా కొనసాగుతుంది. ప్రభుత్వం రైతులను కాకుండా మధ్య దళారులకు మేలు చేసేందుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి. రైతులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. వానలు పడితే మక్కలు తడిచి మొలకెత్తే అవకాశం ఉంది. అధికారులు, నాయకులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలి.

– తోటపల్లి నాగేశ్వరరావు, రైతు, కొణిజర్ల

అమ్ముకున్నాక ప్రారంభిస్తారా?



రైతులు మధ్య దళారులకు అమ్ముకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారా. ఇప్పటికే సగం మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. ప్రైవేట్ వాళ్లు రోజురోజుకు ధర తగ్గిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఎంత ఆలస్యం అయితే రైతులు అంత ఇబ్బంది పడే అవకాశం ఉంది. ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు కేంద్రాలు తెరిపించి కొనుగోళ్లు మొదలుపెట్టాలి.

– తుప్పతి నరసింహారావు, రైతు, కొణిజర్ల

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- డీపీఓ ఆశాలత



నర్సరీలో పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

బోనకల్: నర్సరీల నిర్వాహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత హెచ్చరించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని నర్సరీని మంగళవారం ఆమె పరిశీలించారు. మొక్కల పెంపకం, డంపింగ్ యార్డు నిర్వాహణ, కంపోస్టు షెడ్లను పరిశీలించారు. నర్సరీలో ఏ ఒక్క మొక్క ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వేసవికాలంలోనే డ్రెయినేజీ పనులను ఉపాధిహామీ పని ద్వారా పూర్తి చేయాలన్నారు. జూన్‌లో హరితహారం మొక్కలు నాటే సమయానికి మొక్కలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీఓ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పేదలందరికీ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరురూరల్/కల్లూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలోనే పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. కల్లూరులో మార్కెట్‌యార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద 115 మందికి రూ.29.96 లక్షలు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకంలో 20 మందికి రూ.21 లక్షలు పంపిణీ చేశారు. అంతకుముందు మార్కెట్‌యార్డులో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోనే ప్రథమంగా పేదలకు సన్నబియ్యం అందజేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రైతుల పంట దళారుల చేతిలో పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్సై హరిత, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, వైస్‌చైర్మన్ కోటేశ్వరరావు, ఏఓ ఎం.రూప, సొసైటీ సీఈఓ బీరవల్లి శ్రీనివాసరావు, పసుమర్తి చందర్‌రావు, పెద్దబోయిన శ్రీను, లక్కినేని కృష్ణ, ప్రభాకర్‌రావు, నల్లగట్ల కిషోర్, బొల్లెపోగు రవి, తోట సుబ్బారావు, ఏనుగు సత్యబాబు, ఎస్‌కె యాకూబ్ అలీ, పరిమి భరత్, నర్సింహారావు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలి

పెనుబల్లి: రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. పెనుబల్లి మండల పరిధిలోని కుప్పెనకుంట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి ఏవీఎస్ఎస్ రాజు, గూడూరు మాధవరెడ్డి, పసుమర్తి విశ్వనాథ్, మేకతొట్టి కాంతయ్య, శీలం వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వేంసూరు: రైతుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామన్నపాలెం, చిన్నమల్లెల, కుంచపర్తి అమ్మపాలెం గ్రామాల్లో ఐకేపీ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులకు బోనస్ అందించామని, ఒక్క వేంసూరు మండల రైతులకే రూ.13 కోట్ల 61 లక్షలు బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాజ్జి ప్రసాద్, నాయకులు పుచ్చాకాయల సోమిరెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, పుచ్చాకాయల కాంతరెడ్డి, మందపాటి రాఘవరెడ్డి, కుప్పిరెడ్డి సీతారెడ్డి, కనమతరెడ్డి రంగారెడ్డి, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రేషన్‌షాపులో పరిశీలిస్తున్న తహసీల్దార్ చందర్

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్‌షాపును తహసీల్దార్ పున్నం చందర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి బియ్యం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మైత్రీ, రేషన్‌డీలర్ గత్తం బాలరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది

మధిర: నడిరోడ్డు మీద ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. మధిర సమీపంలోని ఆత్కూరు బైపాస్ రోడ్డు నుంచి పిల్లిగుట్ట వైపు వెళ్లే రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో 'ఒరిగిన విద్యుత్ స్తంభం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ సమస్యపై స్పందించిన మధిర సబ్ డివిజన్ ఏడీఈ అనురాధ ఆదేశాల మేరకు.. విద్యుత్ శాఖ అధికారులు రోడ్డుపై ఉన్న స్తంభాన్ని తొలగించి ఇబ్బంది లేకుండా రోడ్డు పక్కన మరొక స్తంభాన్ని ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి, విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరునాళ్లకు ముస్తాబు..

- 12 నుంచి గురువమ్మతల్లి జాతర



ముస్తాబైన గురువమ్మతల్లి ఆలయం

కారేపల్లి: మండలపరిధిలోని పేరుపల్లి గ్రామంలో కొలువుతీరిన శ్రీ గురువమ్మతల్లి జాతరకు ముస్తాబైంది. ఈనెల 12 నుంచి 17 వరకు 5 రోజుల పాటు, అంగరంగ వైభవంగా జరిగే జాతరలో రోజుకో ప్రత్యేకత ఉంటుందని ఆలయ చైర్మన్ కంచర్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. 12న ఆలయంలో పసుపు కుంకుమ వేడుక, 13 జలబిందెలు, 14 సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ గురువమ్మ తల్లి–సర్వారెడ్డి కల్యాణ మహోత్సవం, అనంతరం ఊరేగింపు, 15న పూల కొప్పెర, 16న గ్రామప్రభలు, 17 ఉదయం 8గంటల నుండి బోనాల సమర్పణతో జాతర ముగుస్తుందని, జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా అంకమ్మతల్లి జాతర



పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో శ్రీ అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా మంగళవారం మైలపట్నం, పుణ్యాహవచనం కార్యక్రమాన్ని కడుగుల విజయబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా కొలబియ్యం, పుట్టకు అనకట్టడం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు చల్లగుండ్ల అజయ్‌బాబు, చల్లగుండ్ల లోకేశ్వరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య



ఏన్కూరు: మాట్లాడుతున్న అభిమన్యుడు



చింతకాని: రాఘవాపురంలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య, తదితరులు

చింతకాని: రైతులు పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతో పంటల సాగులో అవలంభించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి తెలుస్తుందన్నారు. పచ్చిరొట్ట పంటలను సాగుచేయటం వలన భూమిలో పోషకాలు అధిక మోతాదులో లభిస్తాయని తెలిపారు. అనంతరం మండలంలోని లచ్చగూడెం, కొదుమూరు, రాఘవాపురం గ్రామాల్లో జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా అందజేసిన ఎంటీయూ 1010 రకం వరి విత్తనాలతో సాగుచేసిన వరి పంటలను ఆయన పరిశీలించారు. పంటల సాగులో వస్తున్న ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర ఏడీఏ విజయ్ చంద్ర, మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తర్ణాధికారి అయేషా ఫాతిమా, రాము, తేజ, కార్తీక్, కల్యాణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ఏన్కూరు: భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రైతునేస్తం ప్రోగ్రాం అధికారి (డీడీఏఎఫ్‌టీసీ) కె.అభిమన్యుడు అన్నారు. మండల పరిధిలోని నాచారం రైతువేదికలో మంగళవారం రైతునేస్తం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ అధికారుల ఆదేశానుసారం పంటలను సాగు చేసుకోవాలని, వేసవికాలంలో పశువులకు సంక్రమించు వ్యాధులు వాటి చికిత్సమార్గాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ నర్సింహారావు, ఏఈఓలు అశోక్, బాలకృష్ణ, శ్రీకాంత్, భాగ్యలహరి, నవ్య, భవ్య, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేసిన పాఠశాల మెయిన్ గేట్, మరుగుదొడ్లు, కిటికీలు, డ్రెయినేజీ వ్యవస్థలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కూరకుల సైదయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

సత్తుపల్లి: పట్టణంలోని పెద్ద వంతెన సమీపంలో జాతీయ రహదారి పక్కన విద్యుత్ స్తంభం ఒంగి ప్రమాదకరంగా ఉంది. చిన్నపాటి గాలివాన వచ్చిన విద్యుత్ వైర్లు ఊగిపోతున్నాయి. నిత్యం జనం తిరుగుతుండే ప్రదేశంతో స్తంభం ఒంగిపోవటం వల్ల విద్యుత్‌వైర్లు తెగి పడి ప్రమాదం సంభవిస్తుందేమోనంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సత్తుపల్లిటౌన్: పిల్లలు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సత్తుపల్లి సీడీపీఓ కనకదుర్గ అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సత్తుపల్లిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం లభిస్తుందని, క్రమం తప్పకుండా పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించటానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహాలక్ష్మి, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఇలా ఉంటే మురుగు పోయేదెలా?





మురుగు నీరు పారే డ్రెయినేజీల్లో పూడిక పేరుకపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం కాల్వల్లో నిలిచిపోయింది. దీంతో మురుగు నీరు నిలిచిపోతోంది. మురుగునీటి సరఫరా జరగక దుర్గంధం వెదజల్లుతోంది. తల్లాడ మేజర్ పంచాయతీలో ప్రధాన రహదారికి సమీపంలో స్థానిక హనుమత్ పద్మావతి ఆలయానికి వెళ్లే రోడ్డులో డ్రెయినేజీల్లో మురికి నీరు నిలిచిపోయింది. పంచాయతీ సిబ్బంది తాత్కాలికంగా చెత్త తొలగించినప్పటికీ లోపల పూడిక తీయకపోవటంతో మురికి నీటి సరఫరా జరగడం లేదు. ఇళ్లలో నుంచి వాడుకున్న నీరు డ్రెయినేజీల్లో బయటకు పోయే దారే లేక రోజుల తరబడి నిలిచిపోతుంది. ఒక్కోసారి కాల్వల నుంచి బయటకు పొర్లి వాకిళ్లలోకి వస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులు దుర్గంధం భరించలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించాలని, మురుగునీటి నీటి సరఫరా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

– తల్లాడ

ప్రశ్నించాల్సిన అధికారి : కృష్ణారావు, తల్లాడ మేజర్ పంచాయతీ ఈఓ
సెల్ నంబర్ : 9032404279